క్లుప్తంగా

## రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కావలి: రక్తదానం ప్రాణదానంతో సమానమని, విద్యార్థులు ఏడాదికి ఒక్కసారైనా రక్తదానం చేయాలని ఆంధ్ర విద్యార్థి సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ రక్తదాతల దినోత్సవంలో భాగంగా ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) ఆధ్వర్యంలో విద్యార్థులు కావలి రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో బుధవారం రక్తదానం చేశారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, ఆంధ్ర విద్యార్థి సంఘ రాష్ట్రాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, అభిషేక్, మహంత్ రెడ్డి, సృజన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఐ బాధ్యతల స్వీకరణ



మర్రిపాడు: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా కుమ్మి సాయికిరణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా వరికుంటపాడు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన మర్రిపాడుకు వచ్చారు.

## పాడి రైతులకు బహుమతుల ప్రదానం



సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలో ఉన్న విజయ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘంలో విజయ డెయిరీ ఎండీ కృష్ణమోహన్ బుధవారం పాడి రైతులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నష్టాల్లో ఉన్న విజయ డెయిరీ మళ్లీ లాభాల బాట పట్టిందని తెలిపారు. సహకార సంఘ అధ్యక్షుడు బేత సుబ్రహ్మణ్యం, సొసైటీ డైరెక్టర్లు, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైగా వెంకట్రావు బాధ్యతల స్వీకరణ



కొండాపురం: మండల ఎస్సైగా ఎం వెంకట్రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరులోని వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై కొండాపురం వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న మహేంద్రను వీఆర్‌కు పంపారు. నూతన ఎస్సై వెంకట్రావు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

## మహిళపై దాడి



కొండాపురం: మహిళపై నలుగురు దాడి చేసి గాయపరిచిన ఘటన నేకునాంపేట పంచాయతీ పరిధిలోని తూర్పుపాళెంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలు పైడి మహాలక్ష్మమ్మ తెలిపిన వివరాల మేరకు.. తూర్పుపాళేనికి చెందిన పైడి మహాలక్ష్మమ్మ, అదే గ్రామానికి చెందిన బొట్లగుంట మధు, రామయ్య, భాగ్యమ్మ, రాణెమ్మ నడుమ చిన్నపాటి వివాదం నెలకొంది. ఈ క్రమంలో వారు ఇటుకతో దాడి చేయడంతో మహాలక్ష్మమ్మ తలకు తీవ్రమైన గాయమైంది. ఆమెను స్థానికులు కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కొండాపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.

## అపూర్వ సమ్మేళనం



సంగం: అన్నారెడ్డిపాళెంలోని పులగం మల్లారెడ్డి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. 2006–07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులను నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించారు. అనంతరం విందు భోజనం చేసి ఆటపాటలతో సందడిగా గడిపారు.

## క్రీడాకారులకు అభినందన



ఆత్మకూరు: జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు విద్యార్థులను ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని బుధవారం అభినందించారు. పట్టణానికి చెందిన ఎస్ విష్ణుష్, అనంతసాగరం మండలం కచ్చేరిదేవరాయపల్లికి చెందిన బండి తనూజను శాలువాలతో సత్కరించి మరిన్ని పోటీల్లో రాణించి ఆత్మకూరుకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విష్ణుష్ తాత ఉదయగిరి ఎంఈఓ తోట శ్రీనివాసులు, బండి తనూజ తండ్రి వీఆర్‌ఏ బండి రామయ్య, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చెత్త ఫుల్..సంపద నిల్

## నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు

- పంచాయతీల్లో లోపిస్తున్న పారిశుధ్యం
- నెరవేరని స్వచ్ఛభారత్ లక్ష్యం



అనుమసముద్రంలో నిరుపయోగంగా మారిన సంపద తయారీ కేంద్రం

అనుమసముద్రంపేట: స్వచ్ఛభారత్ లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం మండలంలోని పలు పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఇంటింటి నుంచి చెత్తను సేకరించడం ద్వారా పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ప్రభుత్వం భావించింది. చెత్తను వర్మికంపోస్టుగా మార్చడం ద్వారా వచ్చే ఆదాయం పంచాయతీల అభివృద్ధికి దోహదపడుతుందని తలచి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. వాటి నిర్వహణపై అధికారులు అలసత్వంతో వహించడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. మండలంలో 19 పంచాయతీలు ఉండగా, 14 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. మండలంలోని కుప్పురుపాడు, పందిపాడు, గుంపర్లపాడు, అక్బరాబాదు, వేల్పులగుంట పంచాయతీల్లో స్థల సేకరణ జరగకపోవడంతో కేంద్రాల నిర్మాణం జరగలేదు. వీటి నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులను ఖర్చు చేశారు. ఒక్కో కేంద్రానికి సుమారు రూ.5 లక్షలు వెచ్చించారు. కేంద్ర ప్రభుత్వం చెత్త సేకరణకు రిక్షాలు, మేజర్ పంచాయతీలకు ట్రాక్టర్లు మంజూరు చేసింది. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, వర్మికంపోస్టు తయారీకి హరితరాయబారులను నియమించింది.

**లక్ష్యంపై నిర్లక్ష్యం**

స్వచ్ఛభారత్ లక్ష్యం క్షేత్రస్థాయిలో నీరుగారిపోయింది. పల్లెలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు వ్యర్థాలతో పంచాయతీలకు సంపద సృష్టించాలన్న ప్రభుత్వ ఆశయం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ముందుకు సాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రీన్‌అంబాసిడర్ల ద్వారా వ్యర్థాల సేకరణ, వర్మికంపోస్టు తయారీని పట్టించుకోకపోవడంతో సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం పూర్తిగా క్షీణిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. శివారు గ్రామాల్లో పారిశుధ్య పనులు అసలు జరగడం లేదని స్థానికులు వాపోతున్నారు. చెత్త రోడ్ల



ఖాళీగా ఉన్న వర్మికంపోస్టు తొట్టెలు

పక్కన పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

## వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టి కృషి



ఏఎస్‌పేట: వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

**ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి**

అనుమసముద్రంపేట: మండలంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు గ్రామస్థాయి నాయకులు కలిసికట్టుగా పని చేయాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శ్రీకొలనుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అంబవరపు కోటిరెడ్డి కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. ఇటీవల కోటిరెడ్డి సోదరి, మాజీ సర్పంచ్ జయమ్మ మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎదుర్కొంటున్న ఇబ్బందులను మేకపాటి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన అందరం సమష్టిగా ఉండి సమస్యలను ఎదుర్కొందామని ధైర్యం చెప్పారు. అనంతరం ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి నివాసంలో నాయకులతో సమావేశమయ్యారు. జెడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, రాజవోలు సొసైటీ చైర్మన్ కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు సంధాని, నాయకులు కాటూరు జనార్దన్‌రెడ్డి, సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి, ఎంపీటీసీ జయమ్మ, ఐతా వెంకటేశ్వర్లునాయుడు, సూరా శ్రీనివాసులరెడ్డి, రఘురామిరెడ్డి, జీ శ్రీనివాసులు, ఎం రమణయ్య ఉన్నారు.

ఆత్మకూరురూరల్: నువ్వూరుపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దొగ్గల నరసారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సంగం: చెన్నవరప్పాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పావళ్ల కొండయ్య మాతృమూర్తి కోటమ్మ ఇటీవల మరణించగా కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. అంతకు ముందు సంగం మండలానికి విచ్చేసిన మేకపాటిని వైఎస్సార్‌సీపీ యువజన విభాగ మండలాధ్యక్షుడు ఉటుకూరు జనార్దన్‌రెడ్డి, తలుపూరుపాడులో షేక్ కరిముల్లా శాలువాలు కప్పి సన్మానించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ తుంగా ఇందూదర్‌రెడ్డి, ఎం దేవసహాయం, మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, ఎంపీడీసీ ముడి మల్లికార్జునరెడ్డి, దగుమాటి మధుసూదన్‌రెడ్డి, శంకరయ్య, బాబు, మన్సూర్, ఫణి, మల్లి, కొండయ్య, ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి పరామర్శ



కాకు శీనయ్యను పరామర్శిస్తున్న రామిరెడ్డి

కావలి/అల్లూరు: కావలి నియోజకవర్గానికి చెందిన పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. బోగోలు మండలం కొండబిట్రగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కాకు శీనయ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శీనయ్య ఇంటికి రామిరెడ్డి చేరుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కావలి రూరల్ మండలం అన్నగారిపాళెం పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ మక్కే భాస్కర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా, ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అల్లూరు మండలం బీరంగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గరిక నరసింహరావు భార్య ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో నరసింహరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. నార్త్‌మోపూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి కృష్ణారెడ్డిని కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

## నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరురూరల్/ ఉదయగిరి : ఆత్మకూరు, ఉదయగిరి ఆర్టీసీ డిపోల్లో గురువారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయా డిపోల మేనేజర్లు కరీమున్నీసా, శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఆత్మకూరుకు సంబంధించి 99592 25645, ఉదయగిరికి సంబంధించి 99592 25095 నంబర్లకు ఫోన్ చేసి ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

## విత్తన శుద్ధితో తెగుళ్లు దూరం



అనుమసముద్రంపేట: రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ దేవసేనమ్మ

అల్లూరు: విత్తన శుద్ధితో తెగుళ్లను దూరంగా ఉంచవచ్చని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి తెలిపారు. బీరంగుంటలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రబీ సాగుకు నారుమడులు పోసే ముందుగా విత్తన శుద్ధి చేసుకుంటే తెగుళ్లను నివారించవచ్చని, తద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. కావలి ఏడీఏ నాగరాజు, ఏఓ శ్రీహరినారాయణ పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: కావలియడవల్లి, గుంపర్లపాడు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆత్మకూరు ఏడీఏ వీ దేవసేనమ్మ పాల్గొన్నారు. రబీకి అనువైన మినుము, వరి రకాలు, విత్తనశుద్ధి, సమగ్ర ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏఓ రజనీ మాట్లాడుతూ నవంబర్ రెండో వారం తరువాత ఆర్‌ఎన్‌ఆర్ 15048, కేఎన్ఎమ్ ఆర్ 1638 రకం నార్లు పోసుకోవాలని సూచించారు.

మర్రిపాడు: చిన్నమాచనూరు, రామానాయుడుపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆత్మ పీడీ జీ శివనారాయణ, ఏఓ ఎస్ రామ్మోహన్ పాల్గొన్నారు.నిమ్మ, వరి పంటలను పరిశీలించి సూచనలు చేశారు. పొదలకూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సురేఖాదేవి విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. కిలో విత్తనాలకు 8 గ్రాముల సుడోమోనాస్ లేదా ఒక గ్రాము ట్రైసైక్లోజోల్ కలిపి శుద్ధి చేసుకోవాలని సూచించారు. కాండం తొలుచు పురుగు నివారణకు 5 సెంట్ల నారుమడికి 800 గ్రాముల కార్బొఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలని తెలిపారు.

దుత్తలూరు: తెడ్డుపాడు, దుత్తలూరు బిట్–1లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆత్మ పీడీ శివన్నారాయణ పాల్గొన్నారు. నల్లరేగడి నేలల్లో శనగపంటకు ప్రత్యామ్నాయంగా జొన్న, మొక్కజొన్న, ధనియాలు, ఆవాలను సాగు చేయాలని సూచించారు.

ఉదయగిరి: మండలంలోని బండగానిపల్లి,జీ చెరువుపల్లి గ్రామాల్లో సాగు చేసిన వరి పంటను ఏఓ అంజనేయులునాయక్ పరిశీలించి సస్యరక్షణ చర్యలను సూచించారు.

సీతారామపురం: అయ్యవారిపల్లి, దేవిశెట్టిపల్లి గ్రామాల్లో వరి పంటను ఏఓ చెన్నారెడ్డి పరిశీలించారు. ఆకుముడత పురుగు ఉన్నట్లు గుర్తించి నివారణకు లీటరు నీటికి 5 మి.లీ వేపనూనె పిచికారీ చేయాలని సూచించారు. అయ్యవారిపల్లి సర్పంచ్ దుగ్గయ్య, దేవిశెట్టిపల్లి ఉపసర్పంచ్ లక్ష్మయ్య, వీఏఏ నరేంద్ర, వీహెచ్ఏ శ్వేత, రైతులు పాల్గొన్నారు.

## వరికోతలకు వరుణుడి దెబ్బ



సోమశిల: అనంతసాగరంలో జోరుగా కురుస్తున్న వర్షం



మర్రిపాడు: పిడుగుపడి దగ్ధమవుతున్న టెంకాయ చెట్టు

సోమశిల: అనంతసాగరం మండలంలోని కొన్ని గ్రామాల్లో ఓ మోస్తరు, మరికొన్ని గ్రామాల్లో భారీ వర్షం బుధవారం కురిసింది. మండలంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. గత వారం రోజులుగా ఏదోక సమయంలో వర్షం కురుస్తూ వరికోతలకు ఆటంకం కలిగిస్తుండడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ధాన్యం చేతికి అందే సమయంలో వర్షం పడితే తీవ్ర నష్టం కలుగుతుందని రైతులు వాపోతున్నారు. వర్షం కారణంగా వరికోతలకు అధిక ఖర్చులు అవుతుండగా, దళారులు ధాన్యాన్ని మార్కెట్ ధరల కంటే తగ్గించి అడుగుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరలు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

**పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు దగ్ధం**

మర్రిపాడు: మండలంలోని ఏపిలగుంటలో బుధవారం ఇళ్ల మధ్య ఉన్న టెంకాయ చెట్టుపై పిడుగుపడి మంటలు చెలరేగాయి. ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. పిడుగుపాటుకు ప్రజలు భయాందోళనలు చెందారు.

**ఉదయగిరిలో మోస్తరు వర్షం**

ఉదయగిరి: ఉదయగిరి పరిసర ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. పంచాయతీ బస్టాండ్ సెంటర్, ప్రధాన వీధుల్లో వర్షపునీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు కొద్దిగా ఇబ్బందులుపడ్డారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కాలువలు పూడికతో నిండడంతో వర్షపు నీరు పొంగి రోడ్లపై ప్రవహించింది. చెత్త, ప్లాస్టిక్ కవర్లు రోడ్లపై పేరుకుపోవడంతో పట్టణ ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



ఆత్మకూరు: సుందరమ్మ ఆలయంలో లలితా సహస్రనామార్చన చేస్తున్న భక్తులు



ఆత్మకూరు: కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



ఆత్మకూరు: కాశీనాయన ఆశ్రమంలో..



ఆత్మకూరు శివాలయంలో..



ఆత్మకూరు: జ్వాలాముఖి ఆలయంలో..

## చదువుల తల్లీ నమోస్తుతే

**కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఏడోరోజైన బుధవారం మూలనక్షత్రం సందర్భంగా అమ్మవారిని సర్వస్వతీదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.**

ఆత్మకూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం, శివాలయంలోని అన్నపూర్ణాదేవి ఆలయం, జ్వాలాముఖి ఆలయం, కాశీనాయన ఆశ్రమంలోని దుర్గాదేవి ఆలయం, సరస్వతీదేవి ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సుందరమ్మ రామాలయంలో మహిళా భక్తులు సామూహిక లలితాసహస్రనామ పారాయణం, కుంకుమార్చన నిర్వహించారు.

సంగం: స్థానిక సంగమేశ్వరాలయంలో కామాక్షితాయి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గంగమ్మ ఆలయంలో ముత్యాల అలంకారం నిర్వహించారు.

ఉదయగిరి: పట్టణంలోని పార్వతీ పరమేశ్వర ఆలయం, సంతానలక్ష్మి ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

చేజర్ల: బోడిపాడులోని మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులను అనుగ్రహించారు.

బిట్రగుంట: విశ్వనాథరావుపేటలోని కోదండరామస్వామి ఆలయంలో సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీహరిబాబు, ఉమామహేశ్వరీ దంపతులు, ఏకేఎం కృష్ణన్ ముత్తుకని, రాజేష్, దేవసేన, సురేష్‌రెడ్డి, సునీత ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయంలో కాళరాత్రి అలంకారం, వరికుంటపాడులోని నాగార్పమ్మ ఆలయంలో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.

దుత్తలూరు: మండలంలోని రాచవారిపల్లిలోని సీతారామమందిరంలో సీతారామలక్ష్మణులకు విశేష పూజలు నిర్వహించారు. రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు. నర్రవాడలోని రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. దుత్తలూరులోని రాజరాజేశ్వరి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

సీతారామపురం: ఘటిక సిద్దేశ్వరంలోని ఇష్టకామేశ్వరిదేవి, సీతారామపురంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి, నారాయణప్పపేటలోని విజయ కనకదుర్గాదేవి ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులను కటాక్షించారు.



బిట్రగుంట: విశ్వనాథరావుపేటలో సరస్వతీదేవి అలంకారం



చేజర్ల మండలం బోడిపాడులో సరస్వతీదేవి అలంకారం



శివాలయంలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



సంగం: సరస్వతీదేవిగా కామాక్షితాయి



సంగం:ముత్యాల అలంకారంలో గంగమ్మ



సీతారామపురం: సరస్వతీదేవిగా ఇష్టకామేశ్వరి



సీతారామపురం: సరస్వతీదేవిగా వాసవీమాత




రాచవారిపల్లిలో సీతారాముల గ్రామోత్సవం



దుత్తలూరు: విశేషాలంకారంలో రేణుకా ఎల్లమ్మ



వరికుంటపాడు: కాళరాత్రి అలంకరణలో మానసాదేవి



వరికుంటపాడు: సరస్వతీదేవిగా నాగార్పమ్మ

## ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



కావలి : కావలి మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా సీహెచ్ శ్రీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## శ్రీవారి సేవలో రామిరెడ్డి



కావలి: పట్టణంలోని బృందావనం కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న దసరా బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం పాల్గొన్నారు. బృందావనం కాలనీ అధ్యక్షుడు శ్రీరాం మాల్యాద్రి ఆధ్వర్యంలో ఆలయ పండితులు రామిరెడ్డికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సమన్వయంతో పంచాయతీల అభివృద్ధి

వరికుంటపాడు/సీతారామపురం/సంగం: సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు సమన్వయంతో పనిచేసి పంచాయతీలను అభివృద్ధి పథంలో నిలపాలని ఎంపీడీఓలు పేర్కొన్నారు. వరికుంటపాడు, సీతారామపురం, సంగం మండల పరిషత్ కార్యాలయాల్లో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణా కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. వరికుంటపాడులో ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జున, సీతారామపురంలో ఎంపీడీఓ భాస్కర్, సంగంలో ఈఓపీఆర్డీ ప్రసాద్ పంచాయతీల పాలన, పారిశుద్ధ్యం, ఆర్థిక నిర్వహణపై శిక్షణ ఇచ్చారు.